సాక్షి
మహబూబాబాద్
శనివారం | 3 | జూన్ | 2023



ధాన్యం కొనుగోళ్లపై అన్నదాతల ఆగ్రహం

ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా సాగడం లేదని ఆరోపిస్తూ రేగులగూడెం అన్నదాతలు ఆగ్రహించారు.
- 8లో▸



రాష్ట్ర శాంతిభద్రతలను కాపాడుదాం

తెలంగాణలో శాంతిభద్రతలను కాపాడుదామని పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ అన్నారు.
- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
43.8^0 / 25.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం సయమంలో ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఏఎస్సై రమేశ్‌కు ఉత్కర్ష సేవా పతకం



మహబూబాబాద్ రూరల్: మానుకోట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పెద్దిరెడ్డి రమేశ్ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుశాఖ ఉన్నతాధికారులు ఏఎస్సై రమేశ్‌ను ఉత్కర్ష సేవా పతకానికి ఎంపిక చేశారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శుక్రవారం ఏఎస్సై పెద్దిరెడ్డి రమేశ్‌కు పతకం అందజేసి అభినందించారు.

ఇండోర్ గేమ్స్ గది ప్రారంభం



మహబూబాబాద్: కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇండోర్ గేమ్స్ గదిని శుక్రవారం మంత్రి సత్యవతిరాథోడ్ ప్రారంభించారు. గదిలో క్రీడా సామగ్రిని పరిశీలించారు. కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్ చంద్రపవార్, అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి మంత్రి కొంతసేపు క్యారమ్స్ ఆడారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మహబూబాబాద్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం 53 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ముగ్గురికి రూ.6,50,000 విలువ చేసే ఎల్‌ఓసీలు అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆరోగ్య శ్రీలో వర్తించని వ్యాధుల కోసమే సీఎం రిలీఫ్ ఫండ్ అన్నారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మహబూబాబాద్ అర్బన్: విద్యాశాఖలో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు మే 24న మద్యంతాగి పోలీస్‌స్టేషన్ మెట్లెక్కిన ఘటనలో డీఈఓ అదే నెల 26న షోకాజు నోటీస్ అందజేసి డిప్యుటేషన్‌పై పెద్దవంగరకు బదిలీ చేశారు. ఈక్రమంలో మే 31న ఒక ఉద్యోగిని సస్పెండ్ చేసినట్లు పత్రాన్ని జిల్లా విద్యాశాఖ వాట్సాప్ గ్రూపులో విడుదల చేశారు. దీనిపై డీఈఓ రామారావును వివరణ కోరగా.. 'నాకు గుర్తులేదు, మరిచిపోయాను.. అడ్మినిస్ట్రేషన్ అధికారులను తెలుసుకోవచ్చంటూ' సమాధానం దాటవేశారు. కాగా ఇద్దరు ఉద్యోగులు తప్పు చేస్తే ఒకరిపై మాత్రమే చర్యలు తీసుకోవడం ఎంటని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. కాగా మరొకరిపై చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల బదిలీలకు వేళాయె

హన్మకొండ అర్బన్: తెలంగాణ సహా దేశంలోని ఐదు రాష్ట్రాలకు సంబంధించి శాసన సభ సాధారణ ఎన్నికల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం రంగంలోకి దిగింది. రాష్ట్రంలో అధికారుల బదిలీల ప్రక్రియ చేపట్టాలని, ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో మూడేళ్లకు మించి అధికారులు విధుల్లో ఉండవద్దని, రాజకీయ నాయకులతో బంధుత్వం ఉన్నవారు డిక్లరేషన్ ఇవ్వాలని, కేసులు నమోదైన వారు ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖలో ఎస్ఐ, సీఐ స్థాయి అధికారులను, రెవెన్యూ అధికారులను సొంత జిల్లాల్లో ఉంచవద్దని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లాలో మాత్రం ప్రస్తుతం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో బదిలీల జాబితా సిద్ధం చేసినా 22న ఉత్సవాలు ముగిసిన తరువాత రిలీవ్ చేసే అవకాశం ఉంటుంది. జిల్లాలో కలెక్టర్ మినహా అధికారులు దాదాపు బదిలీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించి జిల్లాస్థాయి అధికారుల కూడా భారీగా బదిలీలు ఉంటాయని తెలుస్తోంది. ఇక తహసీల్దార్లు పూర్తిగా జిల్లా వదలాల్సిన పరిస్థితి. గతంలో ఎన్నికలు ముగియగానే కొత్త ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే ఎక్కడివారు అక్కడికే అన్నట్లు వచ్చేవారు. ప్రస్తుతం శాసన సభ అనంతరం లోక్ సభ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో బదిలీ అయిన వారు కనీసం సంవత్సరంపాటు ఇతర జిల్లాలో చేయక తప్పని పరిస్థితి నెలకొంటుంది. మొత్తానికి జిల్లాల విభజన, జోనల్ వ్యవస్థ, 317జీఓలతో బదిలీలు అంటేనే హడలిపోతున్న ఉద్యోగులకు ఎన్నికల పేరుతో మరోసారి బదిలీ కుదుపునకు గురవుతున్నారు.

అభివృద్ధి పరుగులు

- తొమ్మిది సంవత్సరాల్లో వందేళ్ల ప్రగతి ప్రణాళిక
- అన్ని వర్గాలకు ఉద్యమ ఫలాలు
- మారిన మానుకోట రూపురేఖలు
- రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో మంత్రి సత్యవతిరాథోడ్





జెండాకు వందనం చేస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్ (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న మంత్రి

సాక్షి, మహబూబాబాద్: 'ఏళ్ల తరబడి పరాయి పాలనలో వివక్షకు గురైన తెలంగాణ ప్రజల బతుకులు మారాలని చేసిన ఉద్యమ ఫలితమే స్వరాష్ట్రం. ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న తొమ్మిది సంవత్సరాల్లో ఉద్యమ నాయకుడు సీఎం కేసీఆర్ నేతృత్వంలో వందేళ్ల ప్రగతి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, ఉద్యమ ఫలితాలు అట్టడుగు వర్గాలకు అందించేలా చేసిన అభివృద్ధి రాష్ట్ర వ్యాప్తంగా అద్దం పడుతుంది' అని రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

మెరుగైన విద్య, వైద్యం..

ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందుతుందని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరుతో నూతన అధ్యాయం మొదలైందన్నారు. 100 పడకల మానుకోట ప్రభుత్వ ఆస్పత్రిని 330 పడకలకు అప్‌గ్రేడ్ చేశామని చెప్పారు. 70 పడకల ఐసోలేషన్ వార్డు, 12 ఐసీయూ వార్డులతో పాటు గూడూరు సీహెచ్‌సీలో పడకల సంఖ్యను పెంచామని చెప్పారు. సుఖప్రసవాలు జరుగుతున్నాయని, కంటి వెలుగు, ఆరోగ్య మహిళ కార్యక్రమాల ద్వారా సేవలు విస్తృతమైనట్లు తెలిపారు. 173హెల్త్ సబ్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మన ఊరు–మన బడి, మన బస్తీ- మనబడి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగుపడ్డాయన్నారు. పిల్లలకు రుచికరమైన మధ్యాహ్న భోజనం పెట్టేందుకు నూతన మెనూ అమలు చేస్తున్నామన్నారు. విదేశీ విద్య అభ్యసించే విద్యార్థులకు రూ. 20లక్షల అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా పథకం అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రత్యేక గురుకులాలు ఏర్పాటు చేసి కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తున్న తెలంగాణ ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌లో ప్రత్యేక బోధనన అందిస్తున్నామని అన్నారు. అవసరమైన చోట ఇంగ్లిష్ మీడియం పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

పోడు భూములకు పట్టాలు..

ఈనెల 24 నుంచి పోడు రైతులకు పట్టాల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తామని మంత్రి సత్యవతి తెలిపారు. జిల్లాలో 67,730 ఎకరాల భూములకు పట్టాలు పంపిణీ చేస్తామని వివరించారు. రూ. 22కోట్లతో తండాలు, గిరిజన ఆవాసాల్లో గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు, రూ. 87కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. వీటితోపాటు విద్యార్థులకు అనువైన చోట ఆశ్రమ, గురుకులాలు ఏర్పాటు చేశామన్నారు.

పండుగలా వ్యవసాయం..

సాగు నీటి వనరులు పెంచి వ్యవసాయాన్ని పండుగ చేశామని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. రైతుబంధు, రైతు బీమా పథకం ద్వారా రైతులకు ఏటా లక్షల కోట్లు కేటాయిస్తున్నామని తెలిపారు. రైతుల కోసం ప్రతీ సెక్టార్‌లో రైతు వేదికలు నిర్మించామని అన్నారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు పరిహారం విడుదల చేశామన్నారు. ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల ద్వారా రైతులను ప్రోత్సాహించామని చెప్పారు. ప్రాంతీయ పశు వైద్యశాలలు, ప్రాథమిక పశువైద్యశాలలు, ఉప కేంద్రాలు, సంచార పశు వైద్యశాలల ద్వారా పశువులకు వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. మత్స్యశాఖ ద్వారా ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు.

సంక్షేమ పథకాలు

పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని మంత్రి సత్యవతి అన్నారు. గొర్రెల యూనిట్లు, మత్స్యకారులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని అన్నారు. ఆహార భద్రత కల్పించి రూపాయికే కిలో బియ్యం అందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం, సఖి, బాలల సంరక్షణ కేంద్రాల ద్వారా మహిళలకు మద్దతుగా ఉంటూ సేవలు అందిస్తున్నామని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా పేదింటి బిడ్డల వివాహాలకు ఆర్థికసాయం అందిస్తున్నామని, రజకులు, నాయీ బ్రాహ్మణులకు ఉచిత కరెంట్ సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళలతో పాటు, నేత, గీత, బీడీ కార్మికులకు పింఛన్ అందించి ఆదుకుంటున్నామని అన్నారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలు, వైకుంఠ ధామాలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలను నిర్మించి గ్రామాల రూపురేఖలు మార్చామని అన్నారు. మహబూబాబాద్, తొర్రూరు, డోర్నకల్, మరిపెడ మున్సిపాలిటీల్లో పార్కులు, జంక్షన్ల అభివృద్ధి, రోడ్ల వెడల్పు చేసి సుందరంగా తీర్చిదిద్దామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు, కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తెలంగాణ ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అమరవీరులకు నివాళులు

మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా అమరవీరులకు నాయకులు, అధికారులు నివాళులర్పించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, ఆర్డీఓ కొమురయ్య, అధికారులు, నాయకులు నివాళులర్పించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, అధికారులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

- అమరవీరుల కుటుంబాలకు సన్మానం
- ఆకట్టుకున్న స్టాల్స్

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ముందుగా అమరవీరుల కుటుంబాలను మంత్రి సత్యవతి రాథోడ్ సన్మానించారు. పలు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అధికారులతో కలిసి మంత్రి సందర్శించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు..

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. తొలుత జిల్లా కేంద్రంలోని కేంద్రియ విద్యాలయం విద్యార్థులు నృత్యం చేశారు. కురవి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, తొర్రూరు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు, జిల్లా కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కాగా అమరవీరుల కుటుంబాలను సన్మానించిన అనంతరం పలు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. పలు ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడి, లాభాలు తదితర విషయాలపై ఆమె ఆరా తీశారు. అనంతరం వ్యవసాయశాఖకు సంబంధించిన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు.



వ్యవసాయశాఖ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తూ..

ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు



జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ శశాంక



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎస్పీ

మహబూబాబాద్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ శశాంక జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసన్న రాణి, డీఈ సీహెచ్ ఉపేందర్, ఏఈ సురేష్, ఫ్లోర్ లీడర్లు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. టీఎన్జీవోస్ కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. జిల్లా గ్రంథాలయంలో సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు జాతీయ జెండా ఎగురవేశారు.

జిల్లా కోర్టు, ఎస్పీ కార్యాలయాల్లో..

మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర్ ప్రసాద్ జాతీయ జెండా ఎగురవేశారు. సీనియర్ సివిల్ జడ్జి సురేష్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ జాతీయ జెండా ఎగురవేశారు. అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, జిల్లాలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర్ ప్రసాద్

ఉత్తములకు ప్రశంసపత్రాలు



అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ప్రశంస పత్రం అందజేస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే



డీఎఫ్ఓ రవికిరణ్



అదనపు కలెక్టర్ డేవిడ్



సత్యనారాయణమూర్తి



సీఐ రవికుమార్

మహబూబాబాద్: ఉత్తమ సేవలు అందించిన అధికారులకు ప్రశంసపత్రాలు అందజేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో 50మంది అధికారులకు మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్ చంద్ర పవార్ చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందజేశారు. కాగా డీఎఫ్ఓ రవికిరణ్, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ సత్యనారాయణ మూర్తి, ఆర్పీఓ రాజ్యలక్ష్మి, డీపీఆర్వో శ్రీనివాస్, ఏడీఏ లక్ష్మీనారాయణ, డీఈఓ రామారావు, వైద్యులు వెంకట్రాములు, జగదీష్, సీఐ రవికుమార్, సీడీపీఓ శిరీష, డిప్యూటీ డీఎంహెచ్ఓ అంబరీషతో పాటు పలువురు అధికారులు ప్రశంసపత్రాలు అందుకున్నారు.

కేవీ ప్రిన్సిపాల్‌కు..

మహబూబాబాద్ అర్బన్: కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ శోభన్ అవతరణ వేడుకల్లో భాగంగా శుక్రవారం ప్రశంసపత్రం అందుకున్నారు.



డీపీఆర్వో శ్రీనివాస్



సీడీపీఓ శిరీష



ఏడీఏ లక్ష్మీనారాయణ




డీఈఓ రామారావు



వైద్యుడు వెంకట్రాములు



ఆర్పీఓ రాజ్యలక్ష్మి



డిప్యూటీ డీఎంహెచ్ఓ అంబరీష



కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ శోభన్

'బడిబాట'కు వేళాయె

- నేటి నుంచి 17వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్
- డోర్ టు డోర్ ప్రచారం చేసేలా చర్యలు
- విద్యార్థులను చేర్పించడమే ప్రధాన లక్ష్యం
- 12న పాఠశాలల పునఃప్రారంభం



బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు (ఫైల్)

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోంది. కాగా ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల చేరికపై విద్యాశాఖ దృష్టి పెట్టింది. ఈమేరకు ఈనెల 3నుంచి 17వ తేదీ వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించనుంది. చదువుకు దూరమైన పిల్లలను పాఠశాలల్లో చేర్పించడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంచే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 898 ప్రభుత్వ బడులు ఉండగా.. గత సంవత్సరం 1,06,829 మంది విద్యార్థులు నమోదయ్యారు.

నేటి నుంచి కార్యక్రమాలు..

బడి బాట నేడు(శనివారం) ప్రారంభం కానుంది. ప్రతీ రోజు ఉదయం 7నుంచి 11గంటల వరకు అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుంది. పిల్లలు ప్రభుత్వ బడుల్లో చేరేలా ర్యాలీలు, బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలతో పాటు డోర్ టు డోర్ ప్రచారం చేపట్టాలి. మన ఊరు–మన బడి, ఇంగ్లిష్ మీడియంలో బోధన, మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాల పంపిణీ, స్కూల్ యూనిఫాంల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి అడ్మిషన్లు పెంచాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో అర్హత కలిగిన పిల్లలను ఒకటో తరగతిలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలి.


ఆచరణలో విఫలం..

బడి బాట కార్యక్రమం ద్వారా సాధారణ విద్యార్థులతో పాటు బడి బయట ఉన్న బడీడు పిల్లలు పాఠశాలల్లో చేర్పించాలి. కాగా మానుకోట పట్టణ కేంద్రంలో బడీడు పిల్లలు చాలామంది బాలకార్మికులుగా మారుతున్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, హోటళ్లు, మెకానిక్ షాప్, పండ్ల బండ్లు, ఇంటి నిర్మాణం, తదితర పనుల్లో పిల్లలు కనిపిస్తున్నారు. బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించడమే బడి బాట లక్ష్యం కాగా.. ఆచరణలో మాత్రం సాధ్యపడటం లేదు. కాగా బడి బాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి బడి బయట ఉన్న పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యక్రమం వివరాలు..

- 3 నుంచి 17 వరకు ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలి
- 12న పునఃప్రారంభం సందర్భంగా పాఠశాలల ఎదుట ముగ్గులు, పూలతో అలంకరించాలి
- 13న ఎఫ్ఎల్ తొలిమెట్టు కార్యక్రమంపై అవగాహన కల్పించాలి
- 14న నూతన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం జరిపి, అదేరోజున బాల సభలు నిర్వహించాలి
- 15న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను బడుల్లో చేర్పించేలా చర్యలు చేపట్టాలి
- 16న ఇంగ్లిష్ మీడియం తరగతులు ప్రారంభం.. పుస్తకాలపై అవగాహన కల్పించాలి
- 17న బాలికా విద్య, భవిష్యత్‌పై సలహాలు, సూచనలు ఇచ్చే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలి

బడులను బలోపేతం చేయాలి



జిల్లాలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమంలో పాల్గొనాలి. అత్యధికంగా విద్యార్థులను చేర్పించిన టాప్3 పాఠశాలలను గుర్తించి హెచ్‌ఎం, ఉపాధ్యాయులను సన్మానిస్తాం. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి.

-పి.రామారావు, డీఈఓ

ఉద్యమకారులకు న్యాయం చేయాలి

మహబూబాబాద్: తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని ఉద్యమకారులు శివరాజ్, ఆదిల్ , హనుమంత్, హైమద్ డిమాండ్ చేశారు. శుక్రవారం మానుకోట పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఉద్యమకారులు ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉద్యమకారులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దళితబంధు పథకంలో దళిత ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పథకాల్లో ఉద్యమకారులకు న్యాయం చేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నీలేష్‌రాయ్, మహేందర్‌రెడ్డి, సుధాకర్, రామకృష్ణ, సిరిపురం వీరన్న, సైదులు, సోమన్న, రాము, అశోక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఉద్యమకారులు

ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గాష్‌ ఆలం

ములుగు: నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు మావోయిస్టులను అరెస్ట్‌ చేసి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ములుగు జిల్లా ఎస్పీ గాష్‌ ఆలం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 01వ తేదీన విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వెంకటాపురం(కె) సర్కిల్‌ పోలీసులు కూంబింగ్‌ నిర్వహించారు. నిషేధిత మావోయిస్టు పార్టీతో సంబంధం కలిగిన వ్యక్తులు పేలుడు పదార్థాలను అమర్చుతున్న క్రమంలో పట్టుకుని, పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేశారు. పూజారి కాంకేర్‌ గ్రామం, ఊసూర్‌ బ్లాక్‌, ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రానికి చెందిన మడివి దేవ మావోయిస్టు పార్టీ ఆర్‌పీసీ కమాండర్‌, మడకం ఊర సీఎన్‌ఎం కమాండర్‌గా పని చేస్తున్నారు. వెంకటాపురం(కె) మండల కార్యదర్శి సుధాకర్‌ ఆదేశాల మేరకు చెలిమెల అటవీ ప్రాంతంలో పేలుడు పదార్థాలను అమర్చాలని ఆదేశించారు. దీంతో పేలుడు పదార్థాలు అమర్చుతున్న క్రమంలో పోలీసులు చాకచక్యంగా ఇద్దరిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఓఎస్డీ అశోక్‌ కుమార్‌, సీఐ శివప్రసాద్‌, సీఆర్‌పీఎఫ్‌ ఎస్సై తిరుపతి రావు, పేరూర్‌ ఎస్సై హరీష్‌ , సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్‌)

ఐనవోలు: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పంథిని గ్రామం చింతకుంటలో చోటు చేసుకుంది. ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. దొంతి శ్రీనివాస్‌రెడ్డి(43) తనకున్న ఐదు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల శ్రీనివాస్‌రెడ్డి నూతనంగా ఇల్లు నిర్మించుకున్నాడు. దీంతో సుమారు రూ.10లక్షలు అప్పు అయింది. పంటలు పండక, భూమి అమ్ముకుని అప్పు తీర్చాలనుకున్నప్పటికీ సాధ్యం కాలేదు. అప్పు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురై గురువారం గడ్డిమందు తాగగా.. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య కవిత, కుమార్తెలు ఆశ్రిత, హారిక ఉన్నారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపారు.

వరంగల్‌లో నృత్యం చేస్తున్న యువతులు



హనుమకొండలో..



జనగామలో..



ఆవిర్భావ సంబురం

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత సాధించిన పురోగతిని వివరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌, సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



వరంగల్‌లో నిర్వహించిన ఆవిర్భావ వేడుకలో ప్రసంగిస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌ బండా ప్రకాశ్‌



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్‌, ఎంపీ కవిత



మానుకోటలో అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



భూపాలపల్లిలో కురుమల విన్యాసాలు



భూపాలపల్లిలో అమరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



దుస్తులను పరిశీలిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



హనుమకొండలో అమరుల కుటుంబ సభ్యులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

రాష్ట్ర శాంతిభద్రతలను కాపాడుదాం

● పోలీస్‌ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్‌ పూజ

మామునూరు: అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ అభివృద్ధిలో పోలీసుల విధి నిర్వహణ సైతం తోడ్పడాలని, సమష్టిగా రాష్ట్ర శాంతిభద్రతలను కాపాడుదామని పోలీస్‌ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్‌ ఇంజారపు పూజ అన్నారు. ఖిలా వరంగల్‌ మండలం పోలీస్‌ ట్రెనింగ్‌ కళాశాలలో రాష్ట్ర అవతరణ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. పోలీసు శిక్షణ కళాశాలలో పరిపాలన భవనం వద్ద పీటీసీ ప్రిన్సిపాల్‌ పూజ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు పుష్ప



మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్‌ ఇంజారపు పూజ

గుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత పోలీసు సిబ్బందిని ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. బంగారు తెలంగాణ మన లక్ష్యమన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ముందుకెళ్తూ.. రాష్ట్ర శాంతిభద్రత, ప్రజల సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్‌, రమేష్‌, భిక్షపతి, పాండు నాయక్‌, ఏఎల్‌ఐలు రాధిక, సత్యనారాయణ, ఆర్‌ఐలు రాజేష్‌, చంద్రశేఖర్‌, దశరథం, నవీన్‌, సీఎల్‌ఐలు నరేష్‌, రవీందర్‌, డాక్టర్‌ సుధీర్‌, ఏఓ ఫర్హానా, పీఆర్‌ఓ రామచారి, 374 శిక్షణార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. వరంగల్‌ ఆర్టీఏ కార్యాలయంలో ఆర్టీఓ ఆఫ్రీన్‌ సిద్దిఖీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఆర్టీఓ ఆఫ్రీన్‌ సిద్దిఖీ జాతీయ జెండాను ఆవిష్కరించగా.. ఎంవీఐలు రవీందర్‌, వెంకన్న, ఏఎంవీఐ శాలిని పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఇన్‌స్పైర్‌కు ఎంపిక

కురవి: అంతర్జాతీయ ఇన్‌స్పైర్‌ పోటీలకు మానుకోట జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. కురవి మండలం బలపాల గ్రామానికి చెందిన నక్క భవాని, పెద్దవంగర మండలంలోని కొరిపల్లి హైస్కూల్‌ విద్యార్థి ఎడ్ల నాని 'సకురా సైన్స్‌ హైస్కూల్‌ ప్రోగ్రాం ఆఫ్‌ జపాన్‌' అనే కార్యక్రమానికి ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి 18 మంది విద్యార్థులు ఎంపికకాగా.. జిల్లానుంచి ఇద్దరికి అవకాశం వచ్చినట్లు ఎస్‌సీఈఆర్‌టీ నుంచి లేఖ వచ్చింది. నవంబర్‌లో జపాన్‌లో జరగబోయే అంతర్జాతీయ ఇన్‌స్పైర్‌కు ఎంపికకాగా, వీరు తమ అప్లికేషన్స్‌ను జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి పంపించాల్సి ఉంటుంది. భవానీ ఎంపికపై గైడ్‌ టీచర్‌ సారంగపాణి, బలపాల సర్పంచ్‌ ముండ్ల ప్రమీల, మండల రైతుబంధు సమితి కో–ఆర్డినేటర్‌ ముండ్ల రమేష్‌, గ్రామస్తులు శుక్రవారం అభినందించారు.



గైడ్‌ టీచర్‌ సారంగపాణితో భవాని

బండరాయి తలపై పడి యువకుడి దుర్మరణం

● పూడిక తీస్తుండగా ఘటన



పృథ్వి (ఫైల్‌)

రాయపర్తి: వ్యవసాయ బావిలో క్రేన్‌ సాయంతో పూడిక మట్టి తీస్తుండగా పైనుంచి బండరాయి తలపై పడి యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన వరంగల్‌ జిల్లా రాయపర్తి మండలంలోని కొండూరు శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సర్నేనిగూడెం గ్రామానికి చెందిన రూపాని నరహరి, యశోద దంపతులు, వారి కుమారుడు రూపాని పృథ్విరాజ్‌ (26) ముప్పై ఏళ్లక్రితం వరంగల్‌ జిల్లా వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామానికి వచ్చి వ్యవసాయక్షేత్రాల్లోని బావుల్లో క్రేన్‌ సాయంతో పూడిక తీతమట్టి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్‌కు చెందిన నాగేశ్వర్‌రావు వ్యవసాయ భూమిలో బావిలో పూడిక మట్టి తీస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో ఉన్న పృథ్విపై బండరాయి పడింది. ఈ ఘటనలో పృథ్వి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల కోసం స్థానిక ఎస్సై బండారి రాజును వివరణకోరగా ఎలాంటి పిటీషన్‌ రాలేదని తెలిపారు.

ఆటోలో నుంచి జారిపడి మహిళ మృతి



మృతిచెందిన విజయ

కేసముద్రం: అజాగ్రత్తతో ఆటో నడపడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళ జారి కిందపడి మృతిచెందిన సంఘటన మానుకోట జిల్లా కేసముద్రం మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కల్వల గ్రామానికి చెందిన గంట విజయ(45) మానుకోటకు వెళ్లేందుకు ఓ ఆటోలో ఎక్కింది. ఈ క్రమంలో తాళ్లపూసపల్లి దాటాక ఆటో డ్రైవర్‌ యుగేందర్‌ అజాగ్రత్తగా ఆటో నడపడంతో ఆటోలో ప్రయాణిస్తున్న విజయ ఒక్కసారిగా జారి కింద పడింది. దీంతో తలకు తీవ్రగాయం కావడంతో ఆమెను మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతిచెందింది. ఈ మేరకు ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

ధర్మసాగర్‌: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన హనుమకొండ మండలం ధర్మసాగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధి కాజీపేట మండలం రాంపూర్‌ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్‌ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఓ వ్యక్తిని ఢీ కొని తలపై నుంచి వెళ్లగా తల ఛిద్రమై మృతి చెందాడు. శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్తున్న గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి పోలీసులు చేరుకున్నారు. అయితే మృతుని తల ఛిద్రమై గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. మృతుడి ఒంటిపై తెలుపురంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. రాంపూర్‌ వీఆర్‌ఏ రాజ్‌కుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్‌ మార్టం నిమిత్తం వరంగల్‌ ఎంజీఎంకు తరలించారు.

జేసీబీ ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు శ్రీధర్‌

కాజీపేట అర్బన్‌: ద్విచక్రవాహనాన్ని జేసీబీ ఢీ కొట్టడంతో దర్గా కాజీపేటకు చెందిన పబ్బోజు శ్రీధర్‌(33) మృతి చెందిన ఘటన శుక్రవారం న్యూశాయంపేట జంక్షన్‌లో చోటు చేసుకుంది. సుబేదారి పోలీసులు, మృతుడి సోదరుడు పబ్బోజు శ్రీకాంత్‌ తెలిపిన వివరాల ప్రకారం.. దర్గాకాజీపేటకు చెందిన పబ్బోజు శ్రీధర్‌ నగరంలోని ఓ ప్రైవేట్‌ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం శ్రీధర్‌ దర్గా కాజీపేట నుంచి వరంగల్‌కు హంటర్‌రోడ్డు మీదుగా తన ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. న్యూ శాయంపేట జంక్షన్‌కు చేరుకోగా ఎదురుగా వస్తు న్న జేసీబీ డ్రైవర్‌ పల్లెపు సందీప్‌ అతివేగంతో వచ్చి ఢీ కొట్టాడు. దీంతో శ్రీధర్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు శ్రీకాంత్‌ ఫిర్యాదు మేర కు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి ఆత్మహత్య

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌ పరిధి సమ్మయ్యనగర్‌లో శుక్రవారం ఓ బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన కోటేశ్వరమ్మకు సమ్మయ్యనగర్‌లో కుమారులతో ఉంటూ కూలీ పనిచేసుకుంటుంది. అయితే చిన్న కుమారుడు తిరుపతి(16)కు సమాచారం ఇవ్వకుండా పెద్ద కుమారుడితో కలిసి కోటేశ్వరమ్మ గురువారం గుంటూరుకు వెళ్లింది. తనకు చెప్పకుండా వెళ్లినందుకు ఆందోళనకు గురైన తిరుపతి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్‌ తెలిపారు.

దశాబ్ది ఉత్సవాల నోడల్‌ ఆఫీసర్‌గా హరిత



కలెక్టర్‌ సిక్తాతో హరిత

హన్మకొండ అర్బన్‌: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో హనుమకొండ, వరంగల్‌, మహబూబాబాద్‌, జనగామ, ములుగు జిల్లాల నోడల్‌ ఆఫీసర్‌గా విద్యాశాఖ జాయింట్‌ సెక్రటరీ హరితను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె శుక్రవారం హైదరాబాద్‌ నుంచి హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. హరితను కలెక్టర్లు సిక్తా పట్నాయక్‌, ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, శ్రీవత్స కోట, అశ్విని తానాజీ వాకడేలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయా జిల్లాల్లో సమన్వయంతో పనిచేసి దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లపై అన్నదాతల ఆగ్రహం

● కాటారం–మంథని ప్రధాన రహదారిపై బైఠాయింపు



రహదారిపై ధాన్యానికి నిప్పంటించి ఆందోళన చేస్తున్న రైతులు

కాటారం: ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా సాగడం లేదని, కేంద్రం నిర్వాహకులు అడ్డదారి తొక్కుతూ పైసలు ముట్టజెప్పినవాళ్లకే గన్నీ సంచులు ఇస్తున్నారని ఆరోపిస్తూ రేగులగూడెం అన్నదాతలు ఆగ్రహించారు. శుక్రవారం కాటారం– మంథని ప్రధాన రహదారిపై రేగులగూడెం వద్ద రోడ్డుకు అడ్డంగా ధాన్యం బస్తాలు, కర్రలు వేసి రైతులు బైఠాయించారు. ధాన్యం బస్తాలకు నిప్పంటించి నిరసన తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు, రవాణాపై స్పష్టత వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగడంతో రోజుల తరబడి కేంద్రాల వద్ద నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విక్రయించిన ధాన్యాన్ని తరలించడానికి లారీల కొరత ఉందని వర్షాలు పడితే తీవ్రంగా నష్టపోతామని పేర్కొన్నారు. డబ్బులు ఇచ్చిన వారికే కేంద్రం నిర్వాహకులు గన్నీ సంచులు ఇస్తున్నారని కాంటాలు తొందరగా అయ్యేలా చూస్తున్నారని రైతులు ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహణలో అధికారులు, సిబ్బంది విఫలమయ్యారని విమర్శించారు. కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. రైతుల ధర్నా సమాచారం అందుకున్న కాటారం ఎస్సై శ్రీనివాస్‌ సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. తహసీల్దార్‌ జివాకర్‌ రెడ్డి, పీఏసీఎస్‌ అధికారులతో ఎస్సై ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యను వివరించారు. రైతులకు ఇబ్బందులు కల్గకుండా త్వరగా కొనుగోళ్లు సాగేలా చూస్తామని తహసీల్దార్‌, సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. దీంతో రైతులు తమ ఆందోళనను విరమించారు.

డబుల్‌ ఇంజన్‌ సర్కార్‌తోనే అభివృద్ధి

● జమ్మూకశ్మీర్‌ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్‌సింగ్‌



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్‌సింగ్‌

మహబూబాబాద్‌ అర్బన్‌: డబుల్‌ ఇంజన్‌ సర్కార్‌తోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమని జమ్మూకశ్మీర్‌ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్‌సింగ్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 60ఏళ్లలో చేయలేని అభివృద్ధి, పీఎం మోదీ తొమ్మిదేళ్ల పాలనలో సాధ్యమైందన్నారు. 370 ఆర్టికల్‌ను రద్దు చేసిన ఘనత బీజేపీదేనని, ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకొని దేశంలో కలిపామన్నారు. కేసీఆర్‌ తెలంగాణకు చేసిందేమీ లేదని విమర్శించారు. మానుకోట జిల్లాలో మెడికల్‌ కళాశాల కోసం గిరిజనుల భూములు లాక్కున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. దళిత, గిరిజనులకు 3 ఎకరాల భూమి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. తెలంగాణ కోసం బలిదానం చేసుకున్న కుటుంబాలను చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో దోచుకున్న వారికే సీఎం కేసీఆర్‌ పెద్దపీట వేస్తున్నారని, 1,200 తెలంగాణ అమరవీరుల కుటుంబాల్లో ఒక్కరికి కూడా ఉద్యోగావకాశాలు కల్పించలేదని ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్‌భారత్‌, ఫసల్‌ బీమా, ప్రధానమంత్రి ఆవాస్‌ యోజన లాంటి పథకాలు తెలంగాణలో అమలు కావడం లేదన్నారు. కేసీఆర్‌ తొమ్మిదేళ్ల పాలనలో లక్షల కోట్ల అవినీతి జరిగిందని, బిడ్డ కవిత లిక్కర్‌స్కాంలో ఉండగా, కొడుకు కేటీఆర్‌ ఐటీ మంత్రిగా ఉంటూ దోచుకుంటున్నారని ఆరోపించారు. పోడుభూముల పట్టాలు అందించడంలో సీఎం విఫలయ్యారని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్‌ హుస్సేన్‌నాయక్‌, సీనియర్‌ నాయకులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.